
*ఆదర్శానికి వాస్తవానికి పొత్తు కుదరదు. మిథ్యా వాస్తవమని భ్రమించి నప్పుడు ఆదర్శానికి ఆధారం ఉండదు. సత్యం తెలుసు కొనడం దుస్తరమే. కాని ప్రతి ఒక్కరికి ఆలాంటి అవ కాశం జీవితంలో ఒక్కసారి అయినా లభిస్తుంది. దానిని జారవిడవడం అంత సులభమైనది వేరొకటి లేదు.*

---

# అతిథి

## భట్టిప్రోలు కృష్ణమూర్తి






గది తలుపులు చేరవేసి, బోల్టు బిగించి గుమ్మం తెర గాజుటద్దాలకు అడ్డుగా లాగి. వెనుకకు తిరగడం తోనే ఎదురుగా గోడ కున్న నిలువుటద్దంలో ప్రతిఫలిస్తున్న తన మూర్తిని చూసుకొన్నశాంత అలాగే ఒక నిమిషం నిలబడి పోయింది. తాను కట్టుకొన్న లేత నీలి రంగు చీర తన కళ్ళకే వింతగా కనిపిస్తున్నది. చీర ఈవిధంగా కట్టుకుని ఎన్నాళ్లయింది తాను! ఈ పదేళ్ళుగా జపాన్‌లో వాళ్ల దేశా చారం ప్రకారం వాళ్ల దుస్తులే ధరించేది కాని

చీరా, జాకట్టూ, పరికిణీ ఇత్యాది ముట్టుకోనే లేదు. రంగూన్‌లో ఉన్నప్పుడు కాబోలు ఆఖరి సారిగా తాను చీర కట్టుకున్నది.

రంగూన్! ఆ రాత్రి —పదహారేళ్ల క్రిందటి ఆ భయంకరమైన రాత్రి— పైన జోరుగా కుంభవృష్టిగా కురుస్తున్నది వాన. అప్పటి కప్పుడే మూడు నాలుగు నెలలుగా తానింటికి రావడానికి ఒక వేళా పాళా లేకుండా పోయింది. ఒక్కొక్కరోజు ఇంటికే వచ్చేదికాదు. ఆరాత్రి పదకొండు అయినట్లుంది తాను ఇంటికి చేరుకునే టప్పటికి. తన ఒంటికి అంటుకు పోయిన చీర వైపు చూడడానికి మొహమాట పడ్డాడేమో పని కుర్రవాడు రామయ్య తలుపు తీసి వెంటనే వెనుకకు మొహం త్రిప్పుకొని ప్రక్కగదిలోపలికి వెళ్ళి పోయాడు. ఆయన పేము కుర్చీలో చేరబడి తనవైపు చూ స్తున్నారు. అవతలి ప్రక్క గదిలో మంచి బాబు ఏడుపు వినిపిస్తున్నది. ఏమీ మాట్లాడ లేదు ఆయన. తన వైపు చూస్తున్నా తనను దూసుకు పోయి ఎక్కడో వెనుక అనంతమైన అగాధంలోకి చూస్తున్నట్లున్నాయి ఆ కళ్లు. దాది బర్మీస్ భాషలో ఏదో అంటున్నది బాబుతో; ఏడుపూ పాలూ తప్ప మరే భాషా బోధపడని అయిదు నెలల బాబుతో. ఎదురుగా గోడకున్న నిలువుటద్దంలో తన రూపానికి బదులు పదహారేళ్ల క్రిందటి ఈ దృశ్యం చూస్తున్న శాంత "ఓ, భగవాన్" అంటూ వెళ్లి కుర్చీలో కూలబడి చేతులతో మొహం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

ఆరాత్రి— తాను ఉదయం నుంచీ ఇంట్లో లేక పోయినా తన బట్టలూ వస్తువులూ అన్నీ కూడా భద్రంగా పెట్లో సర్దించి ఉంచా రాయన. రామయ్యను పిలిచి ఇంటి ముందు వేచి ఉన్న వాన్ డ్రైవర్‌తో " శాంతా దేవిగారు ఇప్పుడు రారు—నువ్వు వెళ్లి పోవచ్చు" అని కబురు పెట్టి ఉంటే తాను? మాట్లాడ కుండా తన గదిలోనికి వెళ్లి బట్టలు మార్చు కుని భోజనానికి కూర్చుని ఉంటే? తెల్లవారు ఝామున మూడు గంటలకు రహస్యంగా బయ లుదేరిన విమానంలో తానూ భర్త ప్రక్కన బాబుతో పాటు కూర్చుని ఉండేది, కలకత్తా వైపు ప్రయాణం చేస్తూ. ఈ పదహారేళ్ళుగా తన్ను పట్టుకు పీడించిన ఈ దుస్స్వప్నం లేకనే పోయేది. "ఓ, భగవాన్!"

ఆరాత్రి—ఆ భయంకరమైన రాత్రి— తానన్న మాటలు మళ్లీ ఇప్పుడు చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి, టేపురికార్డులో వినవచ్చే గంభీర నాదంతో.

"మళ్లీ వెంటనే వెళ్లి పోవాలి నేను. నాకో అయిదు వందలు కావాలి. ఇవ్వగలరా?"

స్వర్గం, నందనవనం, తన ఇల్లు, వాకిలి, తన బాబు, ఒక సుఖమయ జీవితం, ఒక మధుర స్వప్నం— ఇవన్నీ శాశ్వతంగా తనవిగా ఉండేటట్లుగా వరమివ్వగలిగిన ఆ మహాశక్తిమంత మైన కాలవిభాగం, ఆ క్షణం నుండి తాను కోరు కొన్నది ఒక అయిదు వందలు! "ఓ భగవాన్!"

ఆ రాత్రి బాబు గదిలోనికి వెళ్లనన్నా వెళ్ల లేదు తాను. ఈ పది పన్నెండేండ్లుగా బాబును చూద్దామని,ఒక్కసారి ఆ లేత బుగ్గలమీద వ్రేళ్ళు ఆనిద్దామని, ఆ చిన్ని పెదవులకు తన పెదవులు గట్టిగా ఆనించి ముద్దు పెట్టుకొందామని, తన గుండెలకు వాడిని గట్టిగా అదుముకుందా మని, తనను వేధించిన, పీడించిన, నమిలి నమిలి తినివేసిన, పీల్చి పిప్పి చేసిన, ఆ తహతహ, ఆ ఆవేదన, ఆ బాధ ఇదంతా ఆ క్షణంలో ఎక్కడకు పోయింది ? తన జీవితంలో ఏళ్లైఏళ్లను, అతి అమూల్యమైన ఏళ్లైఏళ్లను ఏళ్లై పది రూపాయిల నోట్లకు అమ్ముకుంది తాను! "ఓ, భగవాన్!"

గట్టిగా పీకుకుంది శాంత తన జుట్టును చెంపల మీదికి. కళ్ల నుండి జారుతున్న ఉప్పు నీళ్లతో తడిసిన పెదవులు విప్పి వికారంగా విశృంఖలంగా నవ్వుకుంది పిచ్చెత్తిన దానిలా తనలో తాను. ఇప్పుడు ఏడ్చి లాభమేమిటి? కావలసిందే తన కీ శాస్తి!

వికారపు నవ్వులో విడివడ్డ పెదవులు మళ్లీ వాటంతట అవే ముడుచుకు పోయాయి. తాను కూర్చున్న కుర్చీకి ఎదురుగా గోడమీద ఉన్న ఫోటోమీద వ్రాలాయి ఆమె కళ్లు.

సావిత్రి!

బాబు మధ్యగా బల్లమీద కొంగబొమ్మ ప్రక్కన కూర్చుని ఉన్నాడు. ఆయన ఒకవైపు కొద్దిగా తిరిగి ఉన్న కుర్చీలో కూర్చుని ఉన్నారు— ఎదురుగా చూస్తున్నా, ఎక్కడో అనంతమైన అగాధంలోకి చూస్తున్నట్లుగా ఉన్న కళ్లతో. సావిత్రి ఇవతల ప్రక్కన నిలబడి ఉంది బాబుకు వెనుక వైపుగా చేయివేసి. ఆయన ప్రక్కగా కాకుండా బాబు ప్రక్కగా నిలబడి ఉంది సావిత్రి—తను వదిలి వెళ్లి పోయిన మాతృ స్థానంలో, ప్రపంచంలో ఉన్న మాతృ ప్రేమ నంతా తన ఇరవై రెండేళ్ల కళ్లలోనే ఇముడ్చుకొని. బాబు మొహం పైకెత్తి ఉంగరాలు తిరిగి కళ్లల్లో పడుతున్న జుట్టులోనుండి, వెండి గిన్నెలో మెరిసే నేరేడు పళ్లలాంటి కనుపాపలతో సావిత్రి వైపే చూస్తూ చిన్న చిరునవ్వు నవ్వు తున్నాడు! "ఓ భగవాన్!"

తన చేతిలో ఉన్న సానపట్టని రత్నాన్ని నిర్లక్ష్యంగా గిరవాటు పెట్టి వెళ్లి పోయింది తాను. సావిత్రి ఆ రత్నాన్ని జాగ్రత్తగా తీసుకొని సానబెట్టి బహుముఖాల కాంతులు విరజల్లేట్లు చేసి తన కంఠ హారంలో నాయక మణిలా అమర్చు కుంది. పదహారేళ్ల తర్వాత మళ్లీ వచ్చి గిరవాటు పెట్టిన రత్నం కోసం తాను

> వాగ్ధాటి నేర్పని ప్రేమ,
> వాణిజ్యమూను.
>
> —సామెత

వెదుకులాడడం నిజంగా వెర్రే!

ట్రెయిన్ ప్లాట్ ఫారమ్ మీద ఆగీ ఆగ డంతోనే గుమ్మం దగ్గర నిల్చున్న తన కళ్లకు అంత మందిలోనూ బాబు రూపమే ముందు కనిపించింది. అంతకుముందు సావిత్రి తనకు పంపిన బాబు ఫోటోలోని మూర్తి కోసం తాను చీకటిలో కనిన కలలన్నీ ఒక్కసారిగా చెదిరి పోయాయి ఆపెద్ద వెలుగులో. ఎదురుగా సాక్షాత్తూ బాబే నిలబడి ఉన్నాడు సావిత్రి ప్రక్కన. తా ననుకుంది అందరినీ దూసుకుని రివ్వున వచ్చి తనను గట్టిగా కౌగలించుకొని "అమ్మా" అంటాడని బాబు. తన గుండెలు అతి వేగంగా కొట్టు కున్నాయి అప్పుడు. ఎవళ్లో వళ్లో వచ్చి తన మెడలో దండలమీద దండలు వేస్తున్నారు. ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డ కొన్ని గొంతులు "జైహింద్", "నేతాజీకి జై", "వీర శాంతా దేవికీ జై!" అని అరుస్తున్నాయి. తన కళ్లు మటుకు బాబు మీదే ఉన్నాయి. బాబు ముందుకు రావడానికి ప్రయత్నమే చెయ్యలేదు. సావిత్రికి ప్రక్కగా జరిగి ఆమె చేతిని వాడు పట్టుకోవడం స్పష్టంగా చూసింది తాను. ఆకాశంమీద ఎగురుతున్న డేగను చూసి భయపడి తల్లి కడుపు క్రిందికి దూరి పోవడానికి ప్రయత్నించే చిన్ని కోడిపిల్ల కళ్లల్లా ఉన్నాయి వాడి కళ్లు! ఎవళ్లో తన చెంపమీద లాగికొట్టినట్లుగా అనిపించింది తనకు! ఇదంతా రైలాగిన ఒక క్షణంలో జరిగి పోయింది. సావిత్రి బాబును తీసుకొని తన దగ్గరకు వచ్చి నమస్కారముపెట్టి, బాబు చేతకూడా నమస్కారము పెట్టించింది—చూడ డానికి వచ్చిన ఎవరో బంధువులకు నమస్కారం పెట్టించినట్లుగా. "ఓ, భగవాన్!"

కారులో డ్రైవ్ చేస్తున్న ఆయన ప్రక్కగా బంట్రోతు కూర్చుని ఉన్నాడు. వెనుక సీట్లో తనకూ సావిత్రికీ మధ్యను కూర్చుని ఉన్న బాబును ఎంతగా మాట్లాడిద్దామని తాను ప్రయత్నించినా మళ్లీ సావిత్రి తనడిగిన ప్రశ్ననే రెట్టించి అడిగి సమాధానం చెప్పించేంత వరకూ వాడంతట వాడుగా జవాబే చెప్పలేదు— "ఓ, భగవాన్!"

ఆ రాత్రి ఆ భయంకరమైన పిశాచి నృత్యపు రాత్రి—

"ఒక్కసారి బాబును చూసి వెళ్లవూ వెళ్లి పోయే ముందు ?" అని ఆయన అన్న మాటకు సమాధానంగా తానన్న మాటలు మళ్లీ టేప్ రికార్డర్‌లోలా వినపడుతున్నాయి:

"మీరు తీసుకెళ్ళి వాణ్ణి పెంచండి. మళ్ళీ అజాద్ హింద్ దేశంలోనే వాడి మొహం చూస్తాను!"

ఎంతవెర్రి! అజాద్ హింద్ దేశానికీ కన్న కొడుకును చూడడానికీ సంబంధం ఏమిటి? తన ఇంటికీ, తన జీవితానికీ ద్రోహం చేసుకున్న తనకు దేశసేవ చేయడానికి హక్కెక్కడిది? "ఓ, భగవాన్!"

చేతుల్లో మొహం కప్పుకొని విశ్శబ్దంగా ఏడవటం మొదలు పెట్టింది. మళ్ళీ ఆమె ఒక పావు గంటకు తెప్పరిల్లి లేచి కట్టుకున్న బట్టలు మార్చు కొంటున్నప్పుడు అద్దంలో తన ప్రతిబింబం మళ్ళీ ఆమె ఆలోచనలను రెచ్చ గొట్టింది.

తన కన్న సావిత్రి అయిదేళ్ళ చిన్నది. అయినా బాబు ప్రక్క నిలబడ్డప్పుడు తనకన్నా ఎంతో పెద్దదానిలా కనిపిస్తున్నది సావిత్రి! ముప్ఫయి అయిదేళ్ళు నెత్తిమీదికి వచ్చినా ఎందుకీ చిన్న తనపు ఆకారం తన శరీరాన్ని వదల కుండా పట్టుకు పీక్కు తింటున్నది? పదహారేళ్ల పిల్లవాడి తల్లి అంటే ఎవళ్ళూ తనను నమ్మరు. పదేళ్లకే మాతృదేవి ఎలా అయిందీమె అనుకుంటారు తన్ను చూసి! గడిచిన పదేళ్ళుగా తన రూపం ఏమాత్రమూ పెరగ లేదు. మారలేదు. కాలమే ఆగిపోయిందేమో పదేళ్ళుగా తన విషయంలో! అందుకే కాబోలు "అమ్మ" అని తనను పిలవని అంతగా పట్టు పట్టాడు మధ్యాహ్నం బాబు. "ఓ, భగవాన్!"

భోజనాలయ్యిన తరువాత మధ్యాహ్నం విశ్రాంతికని తనను ఈ గదిలో వదిలి వెళ్లి పోయారు బాబూ, సావిత్రీ. తను వచ్చినప్పటి నుంచీ ఒక్కసారన్నా అంత వరకూ "అమ్మా" అని బాబు తనను పిలువలేదు. రాత్రంతా ట్రెయిన్‌లో నిద్ర పట్టక పోయినా మధ్యాహ్నం ఎంత ప్రయత్నించినా తనకు నిద్ర రాలేదు. ఒక అరగంటసేపు చూసి లాభంలేదని లేచి వెళ్లి అవతల డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని వీక్లీ పత్రికలు తిరగ వెయ్యడం మొదలు పెట్టింది తాను. తాననుకుంది బాబు గాని వచ్చి తన దగ్గర కూర్చుని కబుర్లు చెప్తాడేమోనని! కాని ఎవళ్ళూ రాలేదు. పత్రికలో చూస్తున్న బొమ్మలక్రింది శీర్షికలు విడివిడిగా చదువుతున్నా ఆబొమ్మలు దేనికిసంబంధించినవో తన మెదడులోనికి ఎక్కలేదు. చివరకు పత్రికలు అక్కడ పడేసి నెమ్మదిగా లేచి నిలబడింది. ఎంత ఆపుకున్నా ఆగక కాళ్ళు తిన్నగా తనను బాబు గది దగ్గరకు లాగుకు పోయాయి. ఆ గుమ్మం దగ్గర నిలుచున్న తనకు లోపలి నుండి సావిత్రి గొంతు విన వచ్చింది.

"ఇన్నాళ్ళూ నీకు చెప్పిందంతా గాలిలో ఎగిరి పోయింది. నువ్వింత మొండి వాడని నేననుకో లేదు."

బాబు గొంతు:

"పోనీ ఇప్పుడు తెలిసింది కదూ నా మొండి



ఏనుగుల జంట     ఫోటో—ఘంటసాల ఈశ్వరరావు (బందరు)

తనం?"

"అరుణా!"గద్దించి నట్లుగా అంది సావిత్రి.

"కోపమెందుకు మమ్మీ? నువ్విం కేం చెయ్యమన్నా చేస్తాను. కాని అలా 'మమ్మీ' అని మరొకళ్లను పిలవడం మటుకు నాకు చేత కావడం లేదు. సిగ్గుగా అనిపిస్తుంది మమ్మీ!"

"సిగ్గెందుకరుణా, కన్న తల్లిని మమ్మీ అని పిలవడానికి?" లాలనగా అంది సావిత్రి.

"కన్న తల్లులెవళ్ళూ పదహారేళ్లయ్యాక కొడుకును చూడటానికి రారు."

"అరుణా!" ఈసారి చిరుకోపం ప్రస్ఫుటంగా వినిపించింది సావిత్రి గొంతులో.

మరి అక్కడ నిలబడలేక పోయింది తాను. "ఓ, భగవాన్!"

మధ్యాహ్నం మూడు గంటలకు ఆయనా, సావిత్రీ, తానూ, బాబూ టీ త్రాగు తున్నప్పుడు అతి కష్టం మీద "అమ్మా" అని పిల్చాడు బాబు తన్ను రెండు మూడు సార్లు. కాని సావిత్రికి లభించిన "నువ్వు" అన్న సంబోధన తనకు లభ్యం కాలేదు, మర్యాద నిండిన "మీరు" అన్న మాట తప్ప. జపాన్‌లో ఉన్నప్పుడు తను పెంచుకున్న కుక్కపిల్లకు తన ప్లేటులో మిగిలి పోయిన రొట్టె ముక్కను విసరడం జ్ఞాపకం వస్తున్నది. "ఓ, భగవాన్!"


బాబుతో ఒంటిగా ఉండడానికి తనకు ఎక్కువసేపు అవకాశమే చిక్కలేదు. ఇంటి ముందు పూల తోటలో తననూ బాబునూ వదిలి సావిత్రి ఇంట్లోకి వెళ్లి పోయింది ఏదో పనివంక పెట్టి. ఆయన పోర్టికోలో కూర్చుని పేపరు చదువు కుంటున్నారు. అంత వరకూ ఎంతో హుషారుగా సావిత్రి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అంతకు క్రిందటి రోజు స్కూల్లో జరిగిన విషయాలు వివరంగా చెప్తున్న బాబు 'స్విచ్ ఆఫ్' చేసిన రేడియోలా అయిపోయాడు. మళ్ళీ తను స్విచ్‌వేసి ట్యూన్ చేయడానికి ప్రయత్నించింది కాని అస్పష్టపు శబ్దాలు, తెగిపోయిన సందర్భంలేని ముక్కలూ మటుకే విన వచ్చాయి. ఒక్కసారిమటుకు ఒక హోలీహోక్ పూవు మీద వ్రాలిన నల్లచుక్కల పసుపురంగు సీతాకోకచిలుకను చూపించి

బాబు, "మీ జపాన్‌లో ఇలాంటి బటర్‌ఫ్లైస్ ఉన్నాయా?" అని అడిగాడు.

తనకు మాట్లాడటం చేత కాదు. అందులో పైదేశాల్లో ఉండి తెలుగు భాష పూర్తిగా మరిచి పోయిందేమో కూడా! లేక పోతే తాను జపాన్‌లో ఉన్న విచిత్ర జంతుజాలాన్ని అంతా వర్ణించి వర్ణించి చెప్తున్నప్పుడు పరధ్యానంగా ఎందు కయిపోయాడు బాబు! తను చెప్తున్నది విందామన్న ఆసక్తే బాబులో లేదు!

"ఓ, భగవాన్! సావిత్రిలో ఉన్న శక్తి నాలో ఎందుకు లేకుండా చేశావు!"

అయిదు గంటల నుండి ఇంత వరకూ గందరగోళంగా నడిచింది కాలం. అంత మహా ఘన వీర కార్యం చేసి పదహారేళ్ల ప్రవాసంలో ఉండి వచ్చిన తనను సన్మానించడం కోసం ఎంతో మంది వచ్చి ఆయన ఇచ్చిన విందులో పాల్గొని



గుడి గంటలు — ఫోటో—ఎ. సంపత్ కృష్ణ (మద్రాసు—1)

వెళ్లి పోయారు, అర్థంలేని అభినందలతో పొగడ్త లతో తనను విసిగించి. పార్టీ జరుగుతూండగానే ఎప్పుడో చల్లగా జారిపోయి పడుకున్నాడు బాబు. ఈ పార్టీ గోలలో నుండి తాను తప్పించు కొని బాబు గదిలోకి వెళ్లి బాబును నిద్ర పుచ్చి ఉంటుంది సావిత్రి! తాను మటుకు తనచుట్టూ మూగిన ఈగల గుంపు నుండి తప్పించుకు వెళ్లలేక పోయింది. అసలు బాబు ఎప్పుడు జారి పోయాడో అదికూడా చూడలేక పోయాయి తన కళ్లు! "ఓ భగవాన్!"

నైటీ (రాత్రి పడుకునే టప్పుడు తొడుగు కునే గౌను) లో ఉన్న ఆమెవెళ్లి పరుపు మీద తలగడాలో తల దూర్చుకుని నిశ్శబ్దంగా ఏడుస్తూ పడుకుంది. ఎప్పుడో నిద్ర పట్టేసింది ఆమెకు. అలసి ఉన్న ఒళ్లు విశ్రాంతి తీసుకుంటున్నా ఆ వేదనలో ఉన్న ఆమె అంత రాత్మ మటుకు విశ్రాంతి పొందలేక పోయింది. ఎన్నెన్నో కలలు రావడం మొదలు పెట్టాయి.

[illegible] తోట అది. గేటు వరకూ [illegible] వచ్చిన వాళ్లందరూ వెనక్కు [illegible]. ఆయన, తాను మటుకు [illegible] వెళ్లి అటూ ఇటూ తిరగడం మొదలు పెట్టారు. ఎన్నో రకాల పూల మొక్కలమీద చెట్ల మీద, లతల మీద విరబూచి ఉన్నాయి. తనెంతో ఉత్సాహంతో ఏవేవో కబుర్లు చెప్పు తున్నది. ఆయనా అప్పుడప్పుడు మాట్లాడుతున్నా ఆయన కళ్లు మటుకు ఎదురుగా ఉన్న దృశ్యం నుండి దూసుకుపోయి ఎక్కడో వెనుకగా ఉన్న అనంతమైన అగాధంలోనికి చూస్తున్నట్లుగా ఉండేవి. తాను చెప్పుతున్న మాటలు వింటున్నారా అని అప్పుడప్పుడు అనుమానం వేసేది. గాలిలో ఏవేవో వంతెనలు గాని డిజైన్లు వేస్తున్నారా, లేక ఏదో పెద్ద కొండ వాగును బంధించి కొండల మధ్య లోయల్లో పెద్ద సరస్సును సృష్టించే విధానం గురించి కలలుగంటున్నారా అనిపించేది తనకు. అలా వింతగా చూస్తున్నప్పుడే ఒక్కొక్కసారి ఆయన చేతిలో ఉన్న తన చేతిని ఆయన గట్టిగా నొక్కి తన మొహంలో మొహం పెట్టి వింతగా చూసేవారు. ఆవంతెనలు, ఆసరస్సులు నీకు కనిపించడం లేదా అన్నట్లుగా. దుర్బలమైన తన చూపులకు ఆ ఘనత చూపించే దృశ్యాలు అసలు కనిపించేవి కావు. తన దౌర్బల్యానికి తన మీద తాను జాలి చూపించుకోవలసింది పోయి, తనలో ఉన్న అహంకారం పైకిలేచి త్రాచు పాములా బుస్సుమంటూ ఆయన మీద పడేది. అమృతం త్రాగే అమరలోక మహర్షి ఆయన; ఏ పాములూ ఆయనను కాటు వెయ్యలేక పోయాయి.

గులాబీ మొక్కమీద కస్తూరి గులాబీ పూలు ఎన్నో విచ్చి ఉన్నాయి. తన కళ్లు ఆ పూలమీద వ్రాలడం గమనించిన ఆయన వెళ్లి ముళ్ల కొమ్మల నడుమ నుండి ఒక చక్కని గులాబీ పూవును కోసి తీసుకు వచ్చి తన జడలో తురుమ బోయారు. ఏ అహంకార పిశాచం ఆవేశించి ఉందో తన్నప్పుడు—ఆయన చేతి కడ్డుగా తన చేయి వెళ్లింది. ఆపూవు క్రింద పడిపోయి రేకులన్నీ విడిపోయాయి.

"దూరంగా చెట్టు మీద ఉన్నప్పుడే పూవు అందం!"

తనన్న మాటలు తనకే వింతగా వినిపించాయి కలలో.

ఆతోటలో ఒక చోట ఉన్న చిన్న కొండ మీదికి ఎక్కి అవతలికి దిగపోయారాయన. తనొక్కతే తిరుగు తున్నది తోటలో. ఆయన విన్నా వినక పోయినా ఎవళ్లో ఒకళ్లు ప్రక్కను [illegible] తను ఒంటరిగా అయిపోవడం వల్ల మాట్లాడ డానికి మరేమీ లేక పోయింది.

[illegible] తిరిగి చూసింది. మానవుడే గాని ఎందుకో

(తరువాయి 49 వ పేజీలో)

# అతిథి

( 19వ పేజీ తరువాయి)

అక్కడక్కడ పెద్ద పులి పోలికలు అతనిలో తనకు కనిపించాయి.

"ఎలావచ్చారు మీరిలోపలికి?"

దూరంగా ఉన్న ప్రహారీగోడ చూపించాడావ్యక్తి. అది దాటి దొంగతనంగా లోపలికి వచ్చాడు.

ఆపెద్ద పులి మనిషే తనకు తోడనిపించింది ఆక్షణంలో. మళ్లీ ఉత్సాహంగా మాట్లాడడం మొదలుపెట్టింది. ఎంతో శ్రద్ధగా విని ఎంతో ప్రత్యుత్సాహం చూపించాడతడు. ఒళ్లు మరిచి పోయింది తాను.

మళ్లీ ఆ కస్తూరి గులాబీ మొక్కవైపు నడిచారు వాళ్లు. తనకు తెలియ కుండానే తనలోతాను అమర్చాడు కస్తూరి గులాబీ పూ వొకటి అతడు. తను చూసుకొన లేదు.

ఎక్కడో అనంతమైన అగాధంలోనికి చూస్తూ కొండ దిగి వస్తున్న ఆయనను తను చూడనే లేదు. కాని ఎలా కనిపెట్టాడో ఆ వచ్చిన వ్యక్తి చల్లగా జారి మాయమై పోయాడు.

ఆయనా తానూ మళ్లీ తిరుగుతున్నారు తోటలో.

"చాలా బాగుంది వల్లని నీజడలో ఈ కస్తూరి గులాబీ!"

మృదువుగా ఆయనవ్రేళ్ళు తన తలలో ఉన్న గులాబీమీద నాట్యం చేశాయి. అప్పుడు తెలిసింది తనకు తన—

విసురుగా జడలోని గులాబీతీసి క్రిందకు విసిరేసింది తాను. ఇంతలో ప్రహారీగోడ కవతల పెద్దపెద్ద మంటలు ఆకాశాన్ని అంటుతూ కనిపించాయి. అహంకారంలో ఉన్న తనను ఆ మంటలు పిలిచినట్లు అనిపించి వడివడిగా గేటు వైపునడిచింది తాను. ఆయనక్రింద పడిపోయిన కస్తూరి గులాబీని పైకితీసి, డిజైన్లు వేసి వేసి మొరటుబారిన వ్రేళ్లతో ఆ పూవుకు అంటుకున్న మట్టిని దులుపుతూ తన వైపుకు వింతగా చూడడం గమనించింది—తాను గేటు వరకూ వెళ్లి ఎందుకో ఒకసారి వెనుకకు తిరిగినప్పుడు. విసురుగా తన వెనుక గేటును లాగి అవతలకు వెళ్లిన తన కాలిమీద కాటువేసింది చటుక్కున ఏదో పెద్దపాము!

"అమ్మో" అని అరుస్తూ లేచి మంచం మీద కూర్చుంది శాంత. ఆమె మొహం మీది చెమట చుక్కలు నీలిరంగు జీరోవాట్ బల్బు కాంతిలో మిలమిల మెరుస్తున్నాయి నీలాల్లా. ఒక పావు నిమిషానికి మళ్లీ ఈ లోకంలో పడింది శాంత స్వప్నలోకంనుండి.

పట్టపగటి వెలుతురులో, పదిమంది మధ్యా ఉన్నప్పుడు తన పాశవిక ప్రకృతిని పైకి చూపకుండా అణచిపెట్టుకున్న మానవునికి, సంస్కృతి, నాగరకత అన్న బురఖాలు తొడుగుకున్న మానవుడికి అప్పుడప్పుడు వికారపు టాలోచనలు రాకుండా మానవు. పై వాళ్ల కది తెలియకపోయినా కాని, ఆ ఆలోచనలకు కన్నె త్రాళ్ళువేసి, మూతి బుట్టలు తగిలించి అదుపులో ఉంచుతాడు సాధారణంగా అతడు. కాని రాత్రి ఏకాంతంగా ఉన్న కొన్నికొన్ని వేళల్లో వికారపు ఆలోచనలను అదుపులోఉంచే ప్రయత్నం మరి చేయడు.

తన వస్తువును సావిత్రి దొంగిలించింది. సావిత్రి దొంగిలించలేదు, ఆయనే దొంగిలించారు. ఆ దొంగ వస్తువును తీసుకువెళ్లి సావిత్రికి ఇచ్చారు. దొంగవస్తువని తెలిసికూడా సావిత్రి దాన్ని తన మెడలో అలంకరించుకుని తిరుగుతున్నది గర్వంగా. తనవస్తువును తాను తీసుకు పోవడం తప్పుకాదు.

అసలు సంగతి చెప్పేస్తే? ఈ ఇంట్లో స్థానంలేని బాబు తన వెనుక కుక్కపిల్లలా వచ్చి తిరుతాడు—"మమ్మీ", మమ్మీ" అంటూ. సావిత్రి దయాధర్మ భిక్షంకోసం తాను ప్రాథేయపడక్కర్లేదు. బల్లమీద ప్లేట్లలో మిగిలిపోయిన వాటికోసం కుక్కలా తాను వేచి *ఉండవలసిన అవసరం లేదు. తనదే పూర్తి* హక్కు బాబు మీద అప్పుడు. ఆయనకుగాని సావిత్రికి గాని అణుమాత్రమైనా మరి హక్కుండదు.

మంచం మీదినుండి దిగి అటూఇటూ పచార్లు చెయ్యడం మొదలు పెట్టింది శాంత. అల్లాఉద్దీన్ మాజిక్ లాంతరు నుండి రాపిడి వల్ల ఉద్భవించిన భూతంలా అంతకంతకూ పెద్దది అవుతున్నది ఆమె మనస్సులోని వికారపు టాలోచన. ఒకసారి పచారు చేయడం మాని గది నడుమ నిలబడి ఆ ఆలోచనలో నీలి బల్బు వైపు చూసింది ఆమె. ఆ బల్బు తన రహస్యాలన్నీ కనుక్కుంటున్నట్లు అనిపించివెళ్లి స్విచ్ ఆఫ్‌చేసి *ఆర్పేసింది దాన్ని. కటిక చీకటి గదిలో క్రమ్ము*కుంది దట్టంగా. ఆలోచన మరింతగా పెరగడం ఆరంభించింది.

మూడు నెలలు జపాన్‌లో చేస్తున్న ఉద్యోగానికి సెలవుపెట్టి వచ్చింది తనిక్కడకు. కాని ఈ మూడు నెలలూ ఎందుకు ఇక్కడ ఈ ఇంట్లో పై దానిలా తానుండాలి? రేపే తెగతెంపులు చేసుకుంటుంది ఈ విషయం. రేపు సాయంత్రం ట్రెయిన్‌లో బాబూ, తానూ కలిసి బయల్దేరి వెళ్లిపోతారు కలకత్తాకు. మూడు రోజుల్లో మళ్లీ జపాన్ చేరుకుంటుంది బాబుతో తాను.

తాను లేనప్పుడు దొంగతనంగా తన భర్తనూ తన కుమారునీ లాగుకుంది సావిత్రి. తాను మటుకు దర్జాగా తన వస్తువును తాను తీసుకు పోతుంది. కావాలంటే సావిత్రిని తన భర్త నుండి దూరం చేసెయ్యవచ్చును.కాని తనకవసరం


## సినిమానటులు

మీరు సినీకారులుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లిషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE,**
***(W.A.P.) PHAGWARA (N.R.)***

## డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోసల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

**INDIAN HOMOEOPATHICCOLLEGE**
**(A.W.P.) JULLUNDUR CITY**

## హోం సినిమా ప్రొజెక్టరుకు

ఆర్డరు యివ్వండి.




### ఇంటిలో అద్భుతమైన వినోదం

సాహసాలు, ప్రేమ, వగైరా దృశ్యాలు మీ ఇంట్లోనే మా ప్రొజెక్టరుతో చూడండి. టార్చితో గాని ఏసి/డిసి ఎలెక్ట్రిసిటీతోగాని పని చేయును. 35 ఎం. ఎం. ఫిలిం. ధర రు. 15. 40 ఫిలిం 4'✕3' స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం పోస్టేజి రు. 4—50 న.పై. డీలక్సు స్పెషల్ రు. 25. 60' ఫిలిం స్క్రీన్, ఇన్‌స్ట్రక్షన్సు ఉచితం. పోస్టేజి రు. 5. తృప్తిలేనిచో సొమ్ము వాపసు. స్టాకు మితంగాఉన్నది. నేడే ఆర్డరివ్వండి.

**Hollywood Cinema Corpn. (Regd.),**
**(APW), 2194, Kalyanpura, Delhi-6.**

లేదు.ఆరకమైన వాంఛలన్నీపదహారేళ్ల క్రిందటే తనలో చచ్చిపోయాయి. ఒక్క బాబు తన దగ్గరుంటే చాలును—తన బాబు,తన రక్తంలో రక్తం,మాంసంలో మాంసం, తన ప్రాణంలో ప్రాణం, కంటికి కనుపించని ఒక సూక్ష్మజీవ కణపు స్థితినుండి తన గర్భకోశంలో విచిత్రంగా పరిపూర్ణ మానవ శిశువుగా రూపొందిన తన బాబు—తొమ్మిది నెలలు మోసి తాను ప్రసవించిన తన బాబు—తనవాడు. ఎవళ్లకూ హక్కులేదు బాబు మీద. ఇన్నాళ్ళూ వెర్రిదానిలా దూరంగా ఉంది తాను. తనకేంకర్మ ఒంటరిగా బ్రతకడానికి?రేపే, రేపే, రేపే!

టక్, టక్, టక్—

నిలబడిపోయింది శాంత హఠాత్తుగా,ఏమిటా చప్పుడు? ఎక్కడినుండి వచ్చింది?

టక్, టక్, టక్—

తలుపుకున్న గాజుఅద్దాలమీద ఎవరో వ్రేలితో కొడుతున్నారు. ఎవరది?

టక్, టక్, టక్.—

## అతిథి

పదిహేడు పద్దెనిమిదేళ్ల క్రిందట ఇదే చప్పుడు తను మంచం మీద పడుకుని ఉండగా రంగూన్‌లో విన్నది తాను ఒకరాత్రి. ఆ రోజు మధ్యాహ్నం హఠాత్తుగా ఏదో కబురు రావడం వల్ల ఆయన పై ఊరికి వెళ్లిపోయారు కొన్ని లక్షల విలువగల ఏదో ప్రాజెక్టును వరదల నుండి రక్షించడానికి. ఇండియా నుండి ఏదో పనిమీద రంగూన్ వచ్చిన ఆయన స్నేహితుడు ప్రసాదరావూ, తామూ మటుకే ఉన్నారు,పని మనుషులుగాక, అంతపెద్ద ఇంట్లో ఆరాత్రి. భోజనం ముందు ప్రసాదరావు బలవంతం మీద కొద్దిగా ఎక్కువగా తాను త్రాగిన ఆ మత్తుద్రవం తన శక్తికి మించిపోయినదై తన ఆలోచనలను మందకొడిగా చేసేసింది ఆరాత్రి. ఓ భగవాన్!నరకపు తలుపులు తెరుచుకున్నాయి తన జీవితంలో!

టక్, టక్, టక్—

ఆ చప్పుడుతో మళ్లీ వర్తమానంలో పడింది శాంత. ఎవరో పిలుస్తున్నారు తనను తలుపు తీయమని. ప్రసాదరావు ఏనాడో చచ్చిపోయాడు.

టక్, టక్,టక్—

తలుపు దగ్గరకు వెళ్లి నిలబడి చెమటలు గ్రక్కుతూనెమ్మదిగాఅడిగింది శాంత:"ఎవరది?"

"నేను!" నెమ్మదిగా వినవచ్చింది, భర్త గొంతు!

వెళ్లి స్విచ్‌వేసి పెద్ద బల్బు వెలిగించి తలుపు తీసింది శాంత.

ప్రభాకర్ లోపలకు వచ్చి నిలబడి పరీక్షగా ఆమెకళ్లలోకి చూశాడు. తనను దూసుకుపోయి ఎక్కడో వెనుకగా ఉన్న ఏదో అనంతమైన అగాథంలోనికి చూస్తున్నట్లుగా ఉన్నాయి ఆ కళ్లు.

తనకు భయంవేసింది ఎందుకో. నెమ్మదిగా అన్నది: "కూర్చోండి."

అతడేమీ మాట్లాడలేదు. అలాగే ఆమెను చూస్తూ కొన్ని క్షణాలు నిలబడి చివరకన్నాడు:

"ఎందుకొచ్చావు నువ్వనిక్కడికి?"

ఒక అడుగు వెనుకకు వేసింది శాంత. ఏం జవాబు చెప్పాలో తోచలేదు. భయంగా అతని కళ్లలోనికి చూస్తూ అలాగే నిలబడిపోయింది.

మళ్లీ అడిగా డతడు: "ఎందు కిక్కడికి వచ్చినట్లు నువ్వు?"

మరునాడు తానననదలుచుకున్న మాటలన్నీ గాలికి ఎగిరి కొట్టుకుపోయాయి ఆ క్షణంలో ఆమె మనసులోనుండి.హక్కు,హక్కు అందామనుకుందిగాని నోరు పెగలలేదు.

ఏ హక్కు? తనకున్న హక్కేమిటి? అగ్ని సాక్షిగా వివాహమైననాడు తన మెడలో తాళి గట్టాడీతడు. సన్నికల్లు చుట్టూ ఏడడుగులు అతనితోపాటు వేసిన తాను అతని సొత్తైపోయింది ఆ క్షణంనుండీ. తన మనస్సూ,తన శరీరం, తన భావి జీవితమూ సర్వమూ అతనికే అంకితమైపోయాయి ఆ ముహూర్తంలో. మానవమానమూ తన గర్భాశయంలో ప్రభవిస్తున్నఓవమ్ (జీవపు గుడ్డు) మీద అతనిదే పూర్ణాధికారం! అది మానవ రూపం చెందడమో లేక అలాగే నశించిపోవడమో— ఆ విషయం అతని ఇచ్ఛమీదే ఆధారపడి ఉంది. తనకు రూపమిచ్చిన తన కన్న తండ్రి పవిత్ర మంత్రాల ఘోష లో ఆ హక్కును అతనికి ధార పోశాడు! క్రమబద్ధమైన సాంఘిక జీవితం కావాలని కోరుకున్న ప్రతి స్త్రీ, ఏ దేశపుదైనా, ఏ కాలపుదైనా, ఈ హక్కును సక్రమంగా సంక్రమింపచేసి తీరాలి ఎవరో ఒక పురుషుడికి. ఏవో కొన్ని బహుమానాలకు లొంగి ఆ హక్కును





పూవు మీ అదృష్టం చెప్పగలదు



నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**

మళ్ళీ వెనుకకు తీసుకుని మరొకరికి ధార పొయ్యడం జరగవచ్చు కొన్నికొన్ని వేళల్లో—కాని అటువంటివియేమీ లేమీ పాటించకుండా సాంఘిక జీవితానికి ఎదురు తిరిగి రహస్యంగానో బహిరంగంగానో ఆ మొదటి పురుషుని హక్కును మరొకరికి సమర్పించిందా—ఆమె దొంగ! బ్రతికి నంతకాలమూ బాధ పడవలసి వస్తున్నది అందుకే తాను! తనకే హక్కులూ లేవు! తానే అతని వస్తువును దొంగతనం చేసింది. ఏమని జవాబు చెప్పడం ఈయనకు? "ఓ భగవాన్!"

చెమటలు జారిపోతున్నాయి ఆమె మొహం మీదినుండి క్రిందికి. వెర్రిగా అతన్ని చూస్తూ జవాబు చెప్పకుండా అలాగే నిలబడింది ఆమె.

చేతులు వెనుకకు కట్టుకొని నిశ్చలంగా ఆమె వైపు చూస్తూ అన్నాడతడు:

"చూడు శాంతా, మాటిగా చెప్తున్నాను. మా బ్రతుకులు నమ్ము బ్రతకనీ. ఎక్కడినుంచి వచ్చావో అక్కడికే వెళ్ళిపో."

"బాబు—బాబును చూద్దామని వచ్చాను."

"చూశావు గదూ! నిన్ను గుర్తున్నా పట్ట లేదు వాడు. నువ్వువచ్చినప్పటినుండిచూస్తున్నాను. ఎందుకో భయంగా ఉంది నాకు. నీకళ్ళు చూస్తుంటే ఉదయంనుండీ ఏ క్షణంలో అగ్నిపర్వతం పగులుతుందో అనిపించింది మాటి మాటికీ."

మళ్ళీ తనలో ఉన్న అహంకారం పైకి లేచింది, బుసలు కొడుతూ.

"మీకా భయం అక్కర్లేదు. నేనేం రాక్షసిని గాను."

"రాక్షసివికావుగాని ప్రతి మనిషిలో లాగే నీ లోనూ ఉందా నైజం. అది అదుపులో పెట్టుకునే శక్తి నీకు లేదు."

ఆమె కళ్ళు కోపంతో జేవురించాయి. మొదట్లో అతన్ని చూస్తే తనలో కలిగిన భయం జారిపోయింది. కయ్యానికి కాలు దువ్వుతున్నట్లుగా మెడకొద్దిగా వెనుకకు విసిరి నిటారుగా నిలబడి అంది ఆమె:

"అదితెలిసీ నన్నెందుకు రెచ్చగొడుతున్నారు?"

"నిన్ను రెచ్చగొట్టడానికి రాలేదు. ఆ నైజాన్ని అణచి పెట్టుకోవడంలో నీకు సాయపడ్డానికి వచ్చాను. నేను నిన్నప్పుడూ ఇదివరకు గట్టిగా ఏదీ అడుగలేదు. కాని ఈ పూట అడుగుతున్నాను, రేపేఇక్కడినుండి వెళ్ళిపొమ్మని."

"ఈ ఇంట్లోనుండి నన్ను గెంటుతున్నారన్న మాట" ఒక అడుగు ముందుకువేసి అంది ఆమె.

అతడు అలాగే నిశ్చలంగా నిలబడ్డాడు ఆమె వైపు చూస్తూ; అతని కళ్ళు ఎక్కడో వెనుకగా ఉన్న అనంతమైన అగాధంలోనికి చూస్తున్నట్లు ఉన్నాయి.

"వెళ్ళి పొమ్మని బ్రతిమాలుతున్నాను. ఉదయంనుండి ఈ కొన్ని గంటలే ఎంతో కష్టమైపోయింది. మూడు నెలలు నువ్విక్కడుంటావంటే నాకేమో భయంగా ఉంది. కావాలంటే ఈ మూడు నెలలూ ఇండియా అంతా తిరుగు. కావలసినంత డబ్బు తీసుకువెళ్ళు."

"డబ్బు నాకక్కర్లేదు. నీపాటి నేనూ గడించుకుంటున్నాను."

అతడు నవ్వి జాలిగా అన్నాడు:

"డబ్బుకన్న మరేమీ నీ కెప్పుడూ ఇవ్వ లేకపోయాను. ఇప్పుడూ అంతే."

వెనుకకు తిరిగి గుమ్మంవైపు నడిచాడతడు.

అతడు జాలిగా అన్నమాటలు బల్లెపుపోట్లల్లా తగిలాయి ఆమెకు.

"వెళ్ళిపోతాను రేపు—కాని బాబును కూడా తీసుకు పోతాను."

అతడు వెనుకకు తిరుగకుండా అడుగు వేస్తూనే అన్నాడు.

"వీలులేదు."

"ఎందుకు వీలులేదో చూస్తాను—వాడు నా కొడుకు."

గుమ్మం దగ్గరకు వెళ్ళిన అతడు తలుపు మీద చెయ్యివేసి వెనుకకు తిరిగి అన్నాడు నెమ్మదిగా:

"తరువాతింకా నువ్వేం చేస్తావో నాకుతెలుసు. ఆ సంగతి సావిత్రికే తెలుసు. బాబుకు నాటుకే తెలియదు. నువ్వేదో పెద్ద దేశభక్తురాలివనీ, దేశంకోసం భర్తనూ, సంసారాన్నీ, కన్న కొడుకునూ సర్వాన్నీ త్యాగం చేసిన మహా దేవత అనీ అను కుంటున్నాడిప్పుడు. ఆ సంగతి వాడికి చెప్పావంటే ఆ గౌరవం కాస్తా జారిపోతుంది నీమీద. అంతేకాదు శాంతా, వాడి బ్రతుకంతా విషంతో నింపేసినదానివవుతావు. నీలో ఏకోశానన్నా వాడిమీద ప్రేమే ఉంటే నువ్వేమీ మాటాడకుండా ఈ ఇల్లు వదిలి వెళ్ళిపోతావు నువ్వు. అంతే నేను చెప్పదలచుకున్నది."

తలుపులు దగ్గరకు లాగి విసురుగా వెళ్ళిపోయాడు ప్రభాకర్.

నిలుచున్న పాటున అక్కడే నేలమీద కూలబడిపోయి చేతుల్లో మొహం కప్పుకుని ఏడవడం మొదలుపెట్టింది ఆమె.

• • •

ఆ మరునాడే ఆమె వెళ్ళిపోయింది ఒంటరిగా. ★


స్థాపితం 1920
రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)
గోపాలపురం తూ. గో. జిల్లా
కుష్టు బొల్లి మేహపాడ వగైరా చర్మ సుఖ వ్యాధులకు శాస్త్రీయ ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము.
బ్రాంచీలు: వాల్తేరు ఆర్. ఎస్. సికింద్రాబాద్—3560 కింగ్సువే

నారసింహ లేహ్యం
బంగారు చేరినది. మేహము, నిస్సత్తువ, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బీ రు. 3-8-0.
రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు. 1-4-0; పోస్టేజి రు. 1-1-0.
మా క్యాటలాగు, కాలండరు ఉచితం.
పి. పి. ఏ. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రంచును
నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడుటను గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మరంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.